126

పైకి వచ్చినవాడు

సీతారామారావు ఒక విచిత్రమైన వాతావరణంలో పెరిగాడు. అతడు హైస్కూలుచదువు పూర్తిచేసినదాకా ఉన్నఊరువిడిచి పెట్టి వెళ్ళలేదు. ఆవూరే అతని ప్రపంచంగా ఉండేది. ఎందుకంటే అతని అయినవాళ్ళంతా అక్కడే ఉండేవాళ్ళు. అతని మేనత్తలిద్దరినీ ఆవూరే ఇచ్చారు. అతని అక్కనుకూడా మేనరికం ఇచ్చారు. హైస్కూలుతప్ప చెప్పుకోదగినసంస్థ మరేదీ లేనిఆగ్రామంలో ప్రతిమూలా సీతారామారావు సొంతంలాగుండేది–కొన్ని బంధువులఇళ్ళు, కొన్ని స్నేహితులఇళ్ళు, కొన్ని బాగా ఎరిగున్నవాళ్ళఇళ్ళు,మిగిలినవికూడా అంతా తెలిసినఇళ్ళే. ఊళ్ళో ప్రతివీధిగురించీ సీతారామారావుకు ఏవో స్మరణలున్నై. ఊరినిండా అతను ఎక్కినచెట్లే. అతనిజీవితం ఆవూరితో బాగా పెనవేసుకొనిపోయింది.

అతని చిన్నప్పటి వాతావరణంలో ఉండిన మరొక విశేష మేమిటంటే, వాళ్ళవాళ్ళు చాలా సాధారణ కుటుంబమయినప్పటికీ దారిద్ర్యమూ, సంపదా అనే ద్వంద్వం ఎన్నడూ అతన్ని బాధించలేదు. వాళ్ళది చిన్న పెంకుటిల్లు.

వాళ్ళ చిన్న మేనత్తగారిది రెండు నిట్టాళ్ళ పాకా. పెద్ద మేనత్త డాబా వేయించింది. అయితే తనయింటికన్న పెద్ద మేనత్తఇల్లు గొప్పదనిగాని, చిన్నమేనత్తఇల్లు తక్కువదని గాని అతనికెన్నడూ తట్టలేదు – తట్టేతట్టు ఎవరూ చేయ లేదుకూడా. తీరే అవకాశం లేని కోరికలు లేనివాడికి ఐశ్వ ర్యంగురించీ, దారిద్ర్యంగురించీ ఆలోచనలురావు. అటు వంటివాడు. "నేను డబ్బున్నవాణ్ణి. డబ్బులేనివాణ్ణి" అను కోడు. సీతారామారావుకూడా అట్లాగే పెరిగాడు. అతని బంధువర్గంలో మనిషిఆదరం హెచ్చుగాఉండేది. వాళ్ళ మధ్య కలహాలూ, కక్షలూ, సాధింపులూ, రావటం సీతా రామారావు ఎరగనే ఎరగడు. అతని అక్కగారి భర్తా, బావగారూ ఆస్తులు పంచుకున్నప్పుడు తమ్ముడికి మంచి వాటా వచ్చిందన్న అభిప్రాయం అన్న ప్రకటించినప్పుడు సీతారామారావు తండ్రి, "వాడేం కట్టుకుపోయాడు ట్రా" అవసరంవస్తే తనదంతా తెగనమ్మి నీకు పెట్టాడూ?" అన్నాడు. అందులో అతిశయోక్తి కూడా ఏమీలేదు. ఎందు కంటే అదునుల్లో ఎవరికి ఏ అవసరంవచ్చినా నలుగురూ కమ్ముకునేవాళ్ళు. ఎవరూ తీర్చలేనంత అవసరాలు రానూలేదు.

నిజానికి మానవజాతియావత్తూ ఎంతోకాలంపాటు ఇటువంటి ఏర్పాటుమీద కాలం వెళ్ళబుచ్చలేదు. జీవి తంలో పెద్ద పరివర్తన లేనిసమయాల్లో ఒకటిరెండు తరాల మధ్య మాత్రమే తాత్కాలికంగా ఇటువంటి పొత్తు కుదురు

తుంది. అటువంటి వాతావరణం సాధ్యమవుతుంది. కాని సీతారామారావు ఆవాతావరణంతప్ప మరేమీ ఎరగని కారణంచేత ప్రపంచమంతా ప్రతియుగంలోనూ ఆపద్ధతినే నడిచిందనీ, నడుస్తుందనీ పొరబడ్డాడు.

*　　*　　*

సీతారామారావు కాలేజీ చదువుకోసం పైఫ్రాను వెళ్ళవలసి వచ్చినపుడు చాలా బాధపడ్డాడు. తనకుగల సర్వస్వమూ వొదిలేసి ఏ అరణ్యవాసమో పోతున్నట్లనిపించిందతనికి. అతనివెంట ఊరికుర్రాళ్ళు మరిద్దరుకూడా బయలుదేరారు. సీతారామారావు అన్న ఈముగ్గుర్నీ తనబండీలో ఎక్కించుకుని హైరోడ్డుదాకా తోలుకుపోయాడు. సీతారామారావు అన్న రాఘవులు చదివేటప్పుడు ఊళ్ళో మిడిల్ స్కూలుండేది. రాఘవులు ఉన్నంతవరకూ చదివి, తరవాత వ్యవసాయంలో ప్రవేశించి తండ్రికి సాయపడసాగాడు. అతనికి పెళ్ళయింది. ఇద్దరుపిల్లలు కూడానూ.

బస్సువచ్చిందాకా రాఘవులు తిరిగిపోలేదు. ఏవేవో విషయాలు మాట్లాడుతూ నిలబడ్డాడు. సీతారామారావు ఎక్కువగా మాట్లాడలేదు గాని, అన్ననుచూచి గర్వపడ్డాడు. రాఘవులంత మంచివాడు ఊళ్ళోలేడని అందరూ అనుకునేవాళ్ళు అతనిలో ఏకోశానా స్వార్థమూ, కోపమూ లేనట్టుండేది.

బస్సువచ్చింది. ముగ్గురు కుర్రాళ్ళూ ఎక్కారు. రాఘవుడు బండి నుళ్ళించుకుని బయలుదేరాడు. బస్సు కాలవ వంతెన ఎక్కి దిగేదాకా సీతారామారావు అన్న తోలుకుపోయే బండిని చూస్తూనే ఉన్నాడు ఆ బండిలో తన పంచప్రాణాలూ ఇంటికి తిరిగిపోతున్నట్టనిపించింది. సమ్మె చేసినట్టుగా వాగ్గురూ మాట్లాడటం మానేశారు. మరో అరగంట గడచినాక మిగిలిన కుర్రాళ్ళల్లో ఒకరు తనకేసి తిరిగి, "ఏరా? ఈ పాటికి రాఘవులన్నయ్య వాముల్లొడ్డికాడికి పోయి ఉంటాడమా?" అనేసరికి సీతారామారావుకు ఏదుపు వచ్చినంతపని అయింది. మరికాస్సేపటికల్లా రైలుస్టేషను వచ్చేసింది.

టికెట్టు కొని రైల్లో ఎక్కి కూచున్న మరుక్షణంనుంచి సీతారామారావుకు తన జీవితంమీద తనకేమీ అధికారం లేనట్టయింది. అయితే అది కేవలం భ్రమ. ఆక్షణానే అతనిమనస్సు ఈ మారిన పరిస్థితులకు అనుగుణంగా మారే ప్రయత్నం రహస్యంగా ప్రారంభించింది.

"మనవాళ్ళందరిలోకీ పెద్దచదువు చదవబోతున్నవాణ్ణి నేనే. చదవటానే సరికాదు. నలుగురికీ సాయపడాలి. పొలం అన్నకుంటుంది. నేనందులో దమ్మిడీ ముట్టుకోకుండా జరుపుకోవాలి. కాకపోయినా ఏం ఏపాలం? అన్నకిప్పుడే ఇద్దరు కొడుకులు. ఇంకా పుట్టుకొస్తారు? ముగ్గురు నలుగురు పుట్టి పంచుకుంటే ఏమొస్తుంది? తిండికే చాలదు. లాభంలేదు నాపంచాననతో ఒక్కొక్క కుంటే కొ

పొలం చేర్చాలి. అన్నపిల్లలకు చదువులు చెప్పించాలి. వాళ్ళుకూడా సంపాదించుకోగలిగితే ఇబ్బంది ఉండదు... ”

సీతారామారావు ఆలోచనలు గాలికి కొట్టుకుపోసాగాయి. షావుకారు కోటయ్యగారికి మెరకా మాగాణీ కలిసి నూటయాభై ఎకరం. ముగ్గురుపిల్లలు. వాళ్ళకి ముగ్గురు పుడితే! పెద్దఆస్తి ముక్కచెక్కలైపోవటానికి మూడు తరాలుకూడా పట్టదుగద!....బియ్యేపాసయితే కనీసం నెలకో యాభై తెచ్చుకోవచ్చు. ఆరేడుపుట్ల ధాన్యం ఇంటికొచ్చినట్లే! అయిదారు ఎకరాలు కొనుక్కున్నట్టన్నమాట! ఇంకా పెద్దజీతంవస్తే అడగనే అక్కర్లేదు.

నిరాశ కలగకుండా ఉండగలందులకు సీతారామారావు యాభై రూపాయలు నెలజీతం లెక్కవేసుకున్నాడేగాని నూరు నూటయాభైదాకా సంపాదించగలనని అతనికి ధైర్యం లేకపోలేదు. అయితే పానకంలో పుడకలాగా ఒక్క ఆలోచన అతని గొంతు కడ్డంపడింది—అంత ఉద్యోగంచెయ్యాలంటే పొరుగూరువెళ్ళాలి! పుట్టి పెరిగిన ఊళ్ళో ఉండి ఉద్యోగం చెయ్యటం సాధ్యంకాదు, ఏం చేసేట్టు?

* * *

ఆ ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పింది. సీతారామారావు బియ్యేపూర్తి చేసేసరికి కాటకంవచ్చి ధరలు పడిపోయినై. అతని చదువుకనిచేసిన అప్పుక్రింద ఆరెక

రాల పొలం తెగనమ్మవలసివచ్చింది. తండ్రికి పక్షవాతం వచ్చింది. రాఘవులన్న నలుగురు పిల్లల తండ్రి అయినాడు. ఇప్పుడు తను కోటయ్యగారి తూర్పుపొలం కమతానికి చేస్తున్నాడు. జీవితం ఎంతమాత్రం సుఖంగాలేదు. సీతారామారావుకు ఉద్యోగంలేదు. గోళ్లుగిల్లుకుంటూ కూచున్నాడు.

కాని ఊరు పాచిపోయిన చద్దికూడులాగా తయారయింది. చలికాలంరాగానే ఎవరిఇళ్లలో వారు దూరి తలుపులూ కిటికీలూ బిడాయించుకున్నట్టుగా అయిపోయినారు జనం. బంధువులఇళ్ళు పూర్వం స్వంత ఇళ్లల్లే వుండేవి. ఇప్పుడు పరాయిఇళ్లల్లే ఉన్నై.

"బోలెడంతడబ్బు తగలేసి పెద్దచదువు చదివావు. ఈవూళ్ళో కూచుంటే ఏముందిరా? ఎక్కడికన్నా వెళ్ళి నాలుగురాళ్ళు సంపాదించుకుని నీదారిని నువుబతుకు. ని అన్న సంసారం ఈదలేక రెక్కలు విరుచుకుని నానా హైరానా పడుతున్నాడు. వాడికి నీబరువుకూడా దేనికి?" అని చాలామంది సలహా ఇచ్చారు.

ఎవరోపిలిచి తన కేదో ఉద్యోగం ఇస్తారని సీతారామారావు భ్రమ. తాను పొరుగూరువెళ్ళి నలుగుర్ని యాచించి, కొందరిచేత లేదనిపించుకుని దొరికినచోట ఉద్యోగం సంపాదించుకోనటమన్నది అతనికి చాలా అవమానకరంగా తోచింది. అయినా తనకు అదితప్ప మార్గాంతరం లేనట్లు అందరూ చెబుతున్నాగు. అంతకన్నా తన

అన్నచేసే పనే మగసిరిగా ఉంది—మనిషి ఎంత హైరానా పడుతున్నా!

మొత్తానికి సీతారామారావు ఒక ఏడాదల్లా అన్నకి బరువుగానే వున్నాడు. తరువాత అతనికి పెళ్ళయింది. బస్తీ పిల్లనే చేసుకున్నాడు. మామగారు ప్లీడరు. బాగా సంపాదించు కుంటున్నవాడు. మునిసిపల్ వ్యవహారాలలో ఒక వర్గానికి సలహాలిస్తూ పలుకుబడి ఉన్నవాడు. సీతారామారావుకు ఆ సంబంధంరావటం చాలా అదృష్టమని అందరూ అన్నారు. పిల్లకొంచెం స్థూలంగా వున్నా అనాకారి కాదు.

పెళ్ళి అయినాక సీతారామారావు మామగారి ఇంటనే జాస్తిగా వుంటూ వచ్చాడు. అతనికి అదే సుఖంగా ఉంది. ఇక్కడ అతను ఎవరి ఆర్థిక చిక్కులూ ఎదుర్కోనవసరంలేదు. తన మామూలు ఖర్చులుకూడా ధారాళంగా వెళ్ళిపోతున్నాయి.

మామగారు సీతారామారావుకు క్లబ్బు గుమాస్తాగిరీ ఇప్పించాడు. కరువురోజుల్లో నలభై రూపాయల జీతం. పెద్దపెద్ద వాళ్ళందరితోనూ పరిచయం. కొద్దిగా పలుకుబడి కూడా. ఈ నలభైలోనుంచి కనీసం పదో పదిహేనో అన్నకి పంపుదామని సీతారామారావు అనుకున్నాడు. కాని ఎందుకో పడలేదు. ఈమాట భార్యతో అంటే ఇంత చిన్న మొత్తాలను గురించి నిరసనగా మాట్లాడింది.

"తిండిఖర్చూ, ఇంటిఖర్చూ లేదామె. మంచిబట్టలు కొనుక్కోరాదూ ?" అన్నది భార్య. భార్యముచ్చట తీరడం కోసం ఖరీదైన సూటు కుట్టించాడు సీతారామారావు.

ఇంతలో ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెసు ఎన్నికల్లో పోటీచేయ నిశ్చయించి ప్రణాళిక ప్రకటించింది. ఆ ప్రణాళికను ఉన్నదున్నట్లు కాపీకొట్టి ఒక రాజాగారు తామొక పార్టీ లేవదీసి వేరువేరు నియోజకవర్గాలలో నిలబెట్టటానికి అభ్యర్థులను వెతికారు. ఆయనకు చిక్కినవారిలో సీతారామారావు మామగారొకడు.

ఆయన సీతారామారావును వెంబెట్టుకొచ్చి మద్రాసు కాస్మాపాలిటన్ క్లబ్బులో దిగాడు. ఈ కొత్తపార్టీ గెలుస్తుందనీ, ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎవరి అంతరాత్మలలోనూ అట్టే స్థైర్యం వున్నట్టు కనబడలేదు. అదివరకే దెబ్బతిన్న జస్టిస్ పార్టీకి మరొక బురఖా తొడిగి రంగం మీదికి తీసుకొస్తున్నారు. ఇది అందరికీ తెలిసిన రహస్యం. సీతారామారావు మామగారి లాంటివాళ్ళు పూర్వం బహిరంగంగా కాంగ్రెసు ఉద్యమాలతో సానుభూతి చూపినవారు ఈ ఎన్నికలలో ఈ పార్టీకి పెద్ద అండ. ఎన్నికల ఖర్చుకు కొంత డబ్బు తీసుకుని మామా అల్లుళ్ళు తిరిగి వచ్చారు.

ఆ పార్టీ అభ్యర్థుల జాబితాలో సీతారామారావు మామగారి పేరు పడింది. ఎన్నికల ప్రచారం ఆరంభమైంది. ప్లీడరుగారికి డొక్కు కారొకటి వున్నది. (ఇదికూడా ఆయన అభ్యర్థిత్వానికి తోడ్పడినమాట అబద్ధం కాదు) ప్లీడరుగారు తన అనుచరులతో, అల్లుడితో ఎన్నిక ప్రచారానికి బయలుదేరాడు. కొద్దిరోజులపాటు పలుకుబడిగల వాళ్ళచుట్టూ తిరి

గారు. వారిలో కొందరు తమకిందనున్న ఓట్లు ప్లీడరుగారికే వచ్చేటట్టు చూస్తామన్నారు. కొందరు నమ్మకంగా చెప్పలేమన్నారు.

"ఈ ఎన్నికలో నేను ఓడినా నా కభ్యంతరం లేదు. నాయందు విశ్వాసం వున్నవాళ్ళ వోట్లు నాకు పడితేచాలు. నేనుమాత్రం కాంగ్రెస్ వాణ్ని కానా? ఈసారి కాంగ్రెస్ గెలవదు. కాంగ్రెసు ఎన్నికలకు నిలబడడం మహాత్మాజీ దగ్గర్నుంచీ ఎవరికీ ఇష్టంలేదు. నేను పోటీ చేయకపోతే ఇంకో శూద్రుడు వస్తాడని నిలబడటమే. పార్టీని చూచి నాకు వోటివ్వవద్దు. నన్నుచూసే ఇవ్వండి" అని వేడుకున్నాడు ప్లీడరుగారు.

ఇంతకీ ఈయన కెదురుగా నిలబడిన కాంగ్రెసు "శూద్రుడు" అప్పటికే అయిదేళ్ళు జైళ్ళలో మగ్గినవాడు!

ఎన్నికలు దగ్గర పడినకొద్దీ ప్లీడరుగారికి వేడెక్కింది. కారులో ఊరంతా తిరగటమూ, నలుగురు చేరినచోట కారు ఆపి అప్పటికప్పుడే ప్లీడరుగారు ప్రసంగం ప్రారంభించటమూ, గొడ్లకాడపిల్లలు చుట్టూమూగి నోళ్ళుతెరుచుకు వినటమూ, పెద్దవాళ్ళు వినిపించుకోకుండా పోవటమూ చదువుకున్న కుర్రకారు నవ్వటమూ-ఇది నిత్యకార్యక్రమం అయిపోయింది.

ఈ మీటింగుల్లో సీతారామారావుకూడా మాట్లాడసాగాడు. తన అల్లుడికి మాట్లాడేశక్తి ఉండటం గమనించి ప్లీడరుగారు ఆశ్చర్యపడ్డాడు. ఇంకా పెద్దసభలు ఏర్పాటు

చేసి రేపో ఎల్లుండో ఎన్నికలనగా అల్లుడిచేతా, మరికొందరు మిత్రులచేతా మాట్లాడించాలని ప్లీడరుగారు ప్రయత్నించాడు. ఈ ప్రయత్నం అభాసయిపోయింది. వచ్చిన జనమే పత్రికమంది. వాళ్ళు సభ జరగనీయకుండా అల్లరి చేశారు.

ఎన్నికలు జరిగాయి. ప్లీడరుగారి డిపాజిట్ పోయింది. ఆయన పడ్డ శ్రమకు నాలుగ్గైదు వందలు దక్కాయి పరవాలేదు.

*　　*　　*

సీతారామారావు పట్నంలో నూరు రూపాయల ఉద్యోగం సంపాదించాడు. కాస్మాపాలిటన్ క్లబ్ ఊరికే పోలేదు. ఆ రోజులకది మంచి సంపాదనే. నెలకు రెండు పుట్లు! కాని అదేం కర్మమో ఇంటికి పంపించాలంటే కాసీ ఉండేదికాదు. పాతిక రూపాయలు ఇంటి అద్దెకిందే పోయేది. ఉద్యోగానికి తగిన దుస్తులుండాలి. ఇంటికెవరన్నా వస్తే కూచోటానికి నాలుగు కుర్చీలూ, ఆదివారాలు బయటకి పోతే నాలుగేసి రూపాయల ఖర్చూ, భార్యకు అప్పుడప్పుడూ చీరలూ, నగలూ—ఎంతచెట్టు కంత గాలిగా ఎక్కడికక్కడ సరిపోతూనే ఉంది.

రాఘవులు ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. ఇప్పుడు రాఘవులుకు అయిదుగురు పిల్లలు. మొత్తం ఏడుగురయితే

ఇద్దరు పోయారు. పిల్లలెవరికీ బడికి పంపటంలేదని రాశాడు. తిండి పెట్టలేనివాడు పిల్లలకు చదువు లెక్కడ చెప్పిస్తాడు?

"ఈ దుర్దశలో నేనుకూడా వాళ్ళ గొంతుమీద లేను. అంతేచాలు." అని తన అంతరాత్మను సమాధాన పరుచుకో జూశాడు సీతారామారావు. అధమం నెలకో పది పంపినా వాళ్ళకెంతో లాభంగా ఉంటుంది. కాని ఆ పదీ పంపటం అతనికి పడటంలేదు.

అతను పట్నంచేరి దాదాపు రెండేళ్ళు కావస్తోంది. ఈ లోపుగా రెండు మూడుసార్లు అత్తవారింటికి వెళ్ళి నాలు గేసి రోజులుండి వచ్చాడు గాని ఇంటికి వెళ్ళటం పడలేదు. ఆఖరుసారి వెళ్ళినపుడు ఎట్లాగో తెలిసి రాఘవులే చూడ వచ్చాడు. అన్ననూ, అతని పెరిగిన గడ్డమూ, పీక్కు పోయిన మొహమూ చూడగానే సీతారామారావుకు శూలం పెట్టి డొక్కలో పొడిచినట్టయింది. ఎంత దారిద్ర్యం! అటువంటి దారిద్ర్యాన్ని మనుషులు ఎందుకు సహిస్తారు! తాను మారానని ఒప్పుకోవడం ఇష్టంలేక రాఘవులు చాలా మారాడనుకున్నాను.

"అంతా కులాసాయేనా" అన్నాడు సీతారామారావు.

"అదే కులాసా! ఉన్నాం!" అన్నాడు రాఘవులు విశాలంగా నవ్వుతూ. "ఇంటికేసి చూడకపోతివేం? ఒక సారి రారాదూ?"

"రావాలనే అనుకున్నా. రావటానికీ, పోవటానికీ ఒకరోజు ప్రయాణమే!" అన్నాడు సీతారామారావు.

"అప్పుడప్పుడో! అయితేమటుకు? పెద్దవాడు ఇంటి పట్టు నుండటంలా. ఈ వూళ్ళోనే ఏదో ప్రెస్సులో పని చేస్తున్నాడు. నెలకొకసారో, రెండుసార్లో వచ్చి రూపాయో, రెండూ ఇచ్చిపోతూంటాడు. నా కిప్పుడు వాడి బరువులేదు. పెద్దపిల్లదే దిగులు పట్టుకుంది. ఎక్కడన్నా ఓ ఇరవై తెచ్చు కుంటున్న వాణ్ణిచూసి పెళ్ళిచేద్దామనుంది. ఆ బరువుపోతే మిగినవాళ్ళం ఎట్టాగోట్టా తంటాలు పడతాం మరి. ఏవంటా?"

ఏమనటానికీ సీతారామారావుకు పాలు పోలేదు. తాను తన అన్నకు ఏవిధంగానూ సహాయపడలేక పోవటం తలుచుకున్నకొద్దీ ఆశ్చర్యంగా ఉంది.

"నా సంగతి అంతంత మాత్రంగానే ఉంది. సంపా దిస్తున్నానేగాని నా సంపాదనంతా పట్నమే తినేస్తుంది. కళ పడని ఖర్చు!" అన్నాడు సీతారామారావు.

"కానుమరీ!" అన్నాడు రాఘవులు.

"నీ కెప్పుడన్నా డబ్బు కావలిస్తే రాస్తూండు. అయిదుకూ పదికీ అవస్థపడమాకు" అన్నాడు తమ్ముడు.

రాఘవులు నవ్వాడు.

"ఒరే! డబ్బవసరం ఎప్పుడూ ఉంటుంది. ఏం రాసేది? నీదగ్గర మిగిలినప్పుడు నువ్వే పంపిస్తూ ఉండు. నువ్వు ఇబ్బంది పడబోకు సుమా!"

రాఘవులు వెళ్ళిపోగానే సీతారామారావు హృద యంలో ఉండిన భ్రాతృప్రేమ కట్టతెగినట్టయింది. పుట్టి

నూరు దాకా అమ్మేస్తుండిన రోజుల్లో రాఘవులు చదువు మాని నాగలి పట్టాడు. ఆ కాలంలో రాఘవులు బియ్యే దాకా చదివినా సంసారం ఇంత చితికేది కాదు. తన చదువుకోసం రాఘవులు చేసిన త్యాగం ఏమిటీ? ఇవాళ రాఘవులెక్కడున్నాడు? తాను ఎక్కడున్నాడు? రాఘవులు ఏడాదికి నూరు సంపాదిస్తున్నాడో లేదో!

పట్నం తిరిగి రాగానే తీసుకున్న జీతంలోనుంచి సీతారామారావు ఇరవై రూపాయలు అన్నకు పంపాడు. జీతం తక్కువ వచ్చిందేమని భార్య అడిగింది. అన్నకు పంపానన్నాడు భర్త. భార్య ఏమీ మాట్లాడలేదు, గాని ఆవిడ మౌనం మాటలకన్న ఎన్నోరెట్లు భావయుక్తంగా ఉంది.

కొంచెంసేపుండి, "ఈనెల మటుకేనా? నెలనెలా పంపుతారా?" అన్నది.

సీతారామారావుకు చిరాకెత్తింది.

నెల నెలా పంపుతాను. ఒకనెల తిని మిగతా నెలలు పస్తుంటారా?" అన్నాడు.

"నెలకు ఇరవై చొప్పునా?"

"నెలకు అరవై చొప్పున చదువుకింద నాలుగేళ్ళ పాటు ఉమ్మడి ఆస్తిలోనించి తగలేశాడు. మరేం పరవా లేదు. నా చదువు మూలంగా వాళ్ళకు తిండి లేకుండా పోయింది."

* * *

యుద్ధం వచ్చింది: మామగారు తన పలుకుబడితో సీతారామారావుకు రకరకాల ఉద్యోగాలిప్పించాడు. యుద్ధ నిధి వసూళ్ళు, ప్రాపగాండా, రిక్రూట్ మెంట్, చివరకు సప్లయిశాఖ-వీటిల్లో పనిచేసి అతను చాలా డబ్బు పోగు చేశాడు. పెద్దపెద్ద వాళ్ళను పట్టుకున్నాడు. లంచాలు పెట్టాడు. కోటాలు సంపాదించాడు. యుద్ధం ముగిసినా సంపాదన హెచ్చింది.

ఇప్పుడు రాఘవులు పరిస్థితికూడా వెనకటంత ఘోరంగా లేదు. రాఘవులు పల్లెటూరువొదిలి బస్తీచేరాడు. కూతురికి పెళ్ళిచేశాడు. ముగ్గురుకొడుకులు చిన్నచిన్న ఉద్యోగాలుచేసి సంపాదిస్తున్నారు. రాఘవులుకూడా బస్తీలో పొగాకు వ్యాపారం, నేతివ్యాపారం పెట్టాడు. ఇదంతా విని సీతారామారావు తన అన్న భోగభాగ్యాలతో తులతూగు తున్నట్టు ఊహించుకుని తన అంతరాత్మను సంతృప్తిపరుచు కున్నాడు.

కాని సంతృప్తిపడటాని కేమీ లేదు. రాఘవులు పెద్దకొడుకు ప్రెస్సులో కంపోజిటర్. రెండోవాడు సైకిల్ షాపులో పనిచేస్తున్నాడు. మూడోవాడు ఎవరో డాక్టరు గారిదగ్గర నౌకరీ చేస్తున్నాడు. రాఘవులు అల్లుడు కాస్త డొక్కశుద్ధికలవాడు. యుద్ధానికి ముందరే కమ్యూనిస్టులతో కలిసి తిరగసాగాడు. కమ్యూనిస్టు సాహిత్యం తెగచదివాడు. తన సిద్ధాంతాలను బావమరుదులకు నూరిపోస్తుండేవాడు. ఇక రాఘవులు అమాయకుడు. కల్మషం ఎరగనివాడు.

కాస్తమంచిగా మాట్లాడిన వాళ్ళకు వీశెలకొద్దీ పొగాకూ, నెయ్యీ అప్పుపెట్టి భాగస్తుడికి కోపం తెప్పించాడు. రెండు నెలలైనా తిరగకుండానే ఆ వ్యాపారంలో రాఘవులుకు భాగం లేకుండాపోయింది.

పెళ్లయిన చాలాకాలానికి సీతారామారావు భార్య గర్భవతిఅయింది. ఆమెను భర్త పుట్టింటికొకసారి తీసుకొచ్చినప్పుడు అన్నగారి ఇంటికికూడా వెళ్ళాడు. అక్కడి స్థితిగతులన్నీ చూశాడు. అన్ననుచూస్తే జాలివేసింది. ముగ్గురు కుర్రాళ్ళకూ కమ్యూనిస్టులభాష అలవడింది. ఇదంతా డబ్బులేకపోవటంవల్ల వచ్చిన జబ్బే అనుకున్నాడు.

"అన్నయ్యా! వీళ్ళని నావెంట పట్నం పంపిస్తావా? ఎక్కడో ఒకచోట వేయిస్తాను" అన్నాడు సీతారామారావు.

"నీయిష్టం" అన్నాడు రాఘవులు. కాని అతన్ని పిల్లలే పోషిస్తున్నారు అందుచేత పిల్లలతోబాటు ఆయన కూడా పట్నం రావలసివచ్చింది. అయితే, ఇప్పుడిటువంటి కుటుంబాలు సీతారామారావుకు బరువులేదు. అతనికి చాలా వ్యాపారాల్లో వాటాఉంది. చాలారకాల సంపాదన ఉన్నది. స్వాతంత్ర్యం వచ్చినరోజునుంచీ అతను పలుకుబడిగల కాంగ్రెసు వాదులతో దోస్తీగా తిరుగుతున్నాడు.

రాఘవులు పిల్లలతోసహా పట్నంరావటం మంచిదయింది. వాళ్ళు వచ్చిన కొద్దిరోజులకే కమ్యూనిస్టుల మూలంగా కల్లోలాలు బయలుదేరాయి. రాఘవులు కూతురూ, అల్లుడూ అండర్ గ్రౌండ్ అయిపోయారు.

సీతారామారావు రోజూ కమ్యూనిస్టులను తిడుతుండే వాడు. రాఘవులు పిల్లలు వాళ్ళని సమర్థిస్తుండేవాళ్లు. వాళ్ళు ఈ విధంగా తన కెదురు చెప్పటం కృతఘ్నతలాగా తోచేది సీతారామారావుకు.

ఒకనాడు సీతారామరావు యింటికి వచ్చేసరికి యింట్లో కొత్త మొహాలు కనిపించాయి. తీరా విచారిస్తే వాళ్ళు రాఘవులు కూతురూ, అల్లుడూ అని తెలిసింది; రాఘవులు అల్లుడు తా నూహించుకున్నట్టు లేకపోవడం, చూసి సీతారామారావు ఆశ్చర్యపడ్డాడు అతను ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడగలడు. ఎంతసేపు మాట్లాడినా తొణకకుండా హాస్యంగాకూడా మాట్లాడగలడు. పోలీసులు చేసిన దుర్మార్గాలను వర్ణించేటప్పుడుకూడా సాధారణ విషయాలు మాటలాడుతున్నట్టే కనబడ్డాడు. అయితే లోపల ఎంత ఆవేశాన్ని నిగ్రహించుకున్నాడో సీతారామారావు ఊహించగలిగాడు.

వాళ్ళిద్దరూ తమ యింట్లో అజ్ఞాతవాసం పెడతామంటారేమోనని సీతారామారావుకు చెడ్డభయం కలిగింది. కాని వాళ్ళు ఉండలేదు, అన్నాలుతిని చీకటిలోపడి వెళ్ళి పోయారు. వాళ్ళను దిగబెడతామని బయలుదేరి వెళ్ళిన రాఘవులు కొడుకులు తిరిగి ఇంటికిరాలేదు.

తరవాత కొద్దిరోజులకు రాఘవులు పెద్దకొడుకును కొండపల్లి ప్రాంతంలో కాల్చి చంపారు.

* * *

మళ్ళీ ఎన్నికలు వచ్చాయి. తనను కాంగ్రెసు మిత్రులు పోటీ చెయ్యమంటున్నారనీ, రెండువారాలపాటు వచ్చి అక్కడే ఉండి సహాయ పడవలసిందనీ మామగారు సీతారామారావుకు రాశారు. సీతారామారావు భార్యతోనూ, కొడుకుతోనూ వెళ్ళాడు. ఎవరెవరో వచ్చి తన మామతో మాట్లాడి వెళ్ళేవిషయాలన్నీ వింటుంటే కాస్మాపాలిటన్ క్లబ్ జ్ఞాపకం వచ్చింది.

ప్లీడరుగారు పోటీచేస్తున్న సీటుకు కమ్యూనిష్టూ, లోక్ పార్టీ మనిషీ, ప్రజా-సోషలిష్టూకూడా పోటీచేస్తున్నారు.

"ఏంటీ, కాంగ్రెసువోటు బాగానే చీలుతుంది. అదొక్కటే మనకు కాస్త ఆశ!" అన్నాడు ప్లీడరుగారు.

తీరా విచారిస్తే తన మామగారితో పోటీచేసే అభ్యర్థి రాఘవులు అల్లుడేనని తెలిసింది. సీతారామారావు అతనితో మాటలాడాడుకూడా, మంచిమాటలతో అతను తప్పుకుంటాడేమోనని సీతారామారావు చూశాడు కాని అటువంటి ప్రయత్నం అనవసరం.

మామగారి ఎన్నికలకుగాను సీతారామారావు స్వయంగా చాలా ఖర్చుచేశాడు. మీటింగులలో మాటలాడదామనికూడా అనుకున్నాడు. కాని కాంగ్రెసుపక్షాన మీటింగు పెట్టడమే దుస్సాధ్యమయింది.

ఆ ఎన్నికలలో కమ్యూనిస్టు అభ్యర్థిగెలిచాడు. ప్రజా-

సోషలిస్టుకు కూడా బాగానే వోట్లుపడ్డాయి. మళ్ళీ ప్లీడరు గారికి డిపాజిట్ పోయింది.

ఈ అర్థంలేని ఎన్నికకుగాను తన సొంతడబ్బు ఇరవై వేలదాకా తగలేసుకుని పట్నం తిరిగిపోతూ సీతారామారావు "రాఘవులన్నయ్య అల్లుడు పైకివచ్చినదారి ఏమిటో!" అనుకున్నాడు.